13-11-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీ సత్యాతి-సత్యమైన దీపావళి అయితే కొత్త ప్రపంచములో ఉంటుంది, అందుకే ఈ పాత ప్రపంచము యొక్క అసత్యమైన ఉత్సవాలు మొదలైనవాటిని చూసేందుకు మీకు మనసు కలగకూడదు"

ప్రశ్న:- మీరు హోలీహంసలు, మీ కర్తవ్యము ఏమిటి?

జవాబు:- మన ముఖ్యమైన కర్తవ్యము - ఒక్క తండ్రి స్మృతిలో ఉండటము మరియు అందరి బుద్ధియోగాన్ని ఒక్క తండ్రితో జోడింపజేయడము. మనం పవిత్రంగా తయారవుతాము మరియు అందరినీ తయారుచేస్తాము. మనం మనుష్యులను దేవతలుగా తయారుచేసే కర్తవ్యంలో సదా తత్పరులై ఉండాలి. అందరినీ దుఃఖాల నుండి విముక్తులుగా చేసి, మార్గదర్శకులుగా అయి ముక్తి-జీవన్ముక్తుల మార్గాన్ని తెలియజేయాలి.

పాట:- మిమ్మల్ని పొంది మేము విశ్వాన్ని పొందాము... (తుమ్హే పాకే హమ్నే జహాన్ పా లియా హై...)

ఓం శాంతి. పిల్లలు పాటను విన్నారు. పిల్లలు అంటారు - మేము స్వర్గ రాజ్యపు వారసత్వాన్ని పొందుతాము, దానిని ఎప్పుడూ ఎవరూ కాల్చలేరు, ఎవరూ దోచుకోలేరు, ఆ వారసత్వాన్ని మా నుండి ఎవరూ గెలుచుకోలేరు. ఆత్మకు తండ్రి నుండి వారసత్వము లభిస్తుంది మరియు ఇటువంటి తండ్రిని తప్పకుండా మాత-పిత అని కూడా అంటారు. మాత-పితను గుర్తించేవారే ఈ సంస్థలోకి రాగలరు. తండ్రి కూడా అంటారు - నేను పిల్లల సమ్ముఖములో ప్రత్యక్షమై చదివిస్తాను, రాజయోగాన్ని నేర్పిస్తాను. పిల్లలు వచ్చి అనంతమైన తండ్రిని జీవిస్తూనే తమవారిగా చేసుకుంటారు. జీవిస్తూ ఉండగానే పిల్లలను దత్తత తీసుకోవడం జరుగుతుంది. మీరు మా వారు, మేము మీ వారము. మీరు నా వారిగా ఎందుకు అయ్యారు? మీరంటారు - బాబా, మీ నుండి స్వర్గ వారసత్వాన్ని తీసుకునేందుకు మేము మీ వారిగా అయ్యాము. మంచిది పిల్లలూ, ఇటువంటి తండ్రిని ఎప్పుడూ విడిచిపెట్టి వెళ్ళకండి. లేదంటే దాని పరిణామం ఏమవుతుంది? స్వర్గ రాజ్యపు పూర్తి వారసత్వాన్ని మీరు పొందలేరు. బాబా-మమ్మా మహారాజు-మహారాణిగా అవుతారు కదా, కావున పురుషార్థం చేసి అంతటి వారసత్వాన్ని పొందాలి. కానీ పిల్లలు పురుషార్థం చేస్తూ-చేస్తూ విడిచిపెట్టి వెళ్ళిపోతారు. వెళ్ళి వికారాలలో చిక్కుకుంటారు లేక నరకంలో పడిపోతారు. హెల్ అని నరకాన్ని, హెవెన్ అని స్వర్గాన్ని అంటారు. ఏమంటారంటే - మేము సదా స్వర్గాధిపతులుగా అయ్యేందుకు తండ్రిని మా వారిగా చేసుకుంటాము ఎందుకంటే మేము ఇప్పుడు నరకంలో ఉన్నాము. హెవెన్లీ గాడ్ ఫాదర్ స్వర్గ రచయిత, వారు ఎప్పటివరకైతే రారో అప్పటివరకు ఎవరూ స్వర్గానికి వెళ్ళలేరు. వారి పేరే హెవెన్లీ గాడ్ ఫాదర్. ఈ విషయం కూడా మీకు ఇప్పుడే తెలుసు. తండ్రి అంటున్నారు - పిల్లలూ, మీరు ఏమని భావిస్తారంటే - తప్పకుండా తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకునేందుకు మేము తండ్రి వద్దకు 5 వేల సంవత్సరాల క్రితం వలె వచ్చాము. అయినా కానీ నడుస్తూ-నడుస్తూ మాయా తుఫానులు పూర్తిగా సర్వనాశనం చేసేస్తాయి. అప్పుడిక చదువును వదిలేస్తారు అనగా మరణిస్తారు. ఈశ్వరునికి చెందినవారిగా అయి మళ్ళీ ఒకవేళ చేతిని విడిచిపెడితే ఇక కొత్త ప్రపంచం నుండి మరణించి పాత ప్రపంచంలోకి వెళ్ళినట్లు. స్వర్గ స్థాపకుడైన తండ్రే నరకము యొక్క దుఃఖాల నుండి విముక్తులుగా చేసి మార్గదర్శకునిగా అయి స్వీట్ సైలెన్స్ హోమ్ కు తీసుకువెళ్తారు, అక్కడి నుండే ఆత్మలమైన మనం వచ్చాము. ఆ తర్వాత స్వీట్ స్వర్గము యొక్క రాజ్యాన్ని ఇస్తారు. గతి మరియు సద్గతి - ఈ రెండింటినీ ఇవ్వడానికి తండ్రి వస్తారు. సత్యయుగము సుఖధామము, కలియుగము దుఃఖధామము మరియు ఎక్కడి నుండైతే ఆత్మలమైన మనం వస్తామో, అది శాంతిధామము. ఈ తండ్రి భవిష్యత్తు కొరకు శాంతిదాత, సుఖదాత. ఈ అశాంతి దేశము నుండి మొదట శాంతి దేశములోకి వెళ్తాము. దానిని స్వీట్ సైలెన్స్ హోమ్ అని అంటారు, మనం అక్కడే ఉంటాము. ఆత్మ అంటుంది - మన స్వీట్ హోమ్ అదే, అయితే ఈ సమయంలో మనం ఏ జ్ఞానాన్ని అయితే చదువుతున్నామో, దాని ద్వారా మనకు స్వర్గ రాజధాని లభిస్తుంది. తండ్రి పేరే హెవెన్లీ గాడ్ ఫాదర్, లిబరేటర్ (ముక్తిదాత), గైడ్ (మార్గదర్శకుడు), నాలెడ్జ్ ఫుల్, బ్లిస్ ఫుల్, జ్ఞానసాగరుడు. వారు దయార్ద్ర హృదయుడు కూడా. అందరిపైనా దయ చూపిస్తారు. తత్వాలపై కూడా దయ చూపిస్తారు. అందరూ దుఃఖాల నుండి విముక్తులవుతారు. దుఃఖమైతే జంతువులు మొదలైనవాటన్నింటికీ కూడా ఉంటుంది కదా. ఎవరినైనా కొడితే దుఃఖం కలుగుతుంది కదా. తండ్రి అంటారు - కేవలం మనుష్యమాత్రులనే కాదు, అందరినీ దుఃఖాల నుండి విముక్తులుగా చేస్తాను. కానీ జంతువులనైతే తీసుకువెళ్ళరు. ఇది మనుష్యులకు సంబంధించిన విషయము. ఇటువంటి అనంతమైన తండ్రి ఒక్కరే, మిగిలినవారంతా దుర్గతిలోకి తీసుకువెళ్తారు. అనంతమైన తండ్రే స్వర్గము లేక ముక్తిధామము యొక్క కానుకను ఇచ్చేవారని పిల్లలైన మీకు తెలుసు. వారు

వారసత్వాన్ని ఇస్తారు కదా. ఉనతోన్నతమైనవారు ఒక్క తండ్రే. భక్తులందరూ ఆ భగవంతుడైన తండ్రిని తలచుకుంటారు. క్రిస్టియన్లు కూడా భగవంతుడిని తలచుకుంటారు. స్వర్గ స్థాపకుడైన తండ్రి శివుడు. వారే నాలెడ్జ్ ఫుల్, బ్లిస్ ఫుల్. దీని అర్థము కూడా పిల్లలైన మీకు తెలుసు. మీలో కూడా నంబరువారుగా ఉన్నారు. కొందరు ఎలా ఉన్నారంటే, ఎంతగా జ్ఞానము యొక్క అలంకరణ చేసినా కానీ మళ్ళీ వికారాలలో పడిపోతారు, అశుద్ధమైన ప్రపంచాన్ని చూస్తారు.

ఎంతోమంది పిల్లలు దీపావళిని చూసేందుకు వెళ్తారు. వాస్తవానికి నా పిల్లలు ఈ అసత్యమైన దీపావళిని చూడకూడదు. కానీ జ్ఞానం లేకపోతే మనసు కలుగుతుంది. మీ దీపావళి సత్యయుగములో ఉంటుంది, అప్పటికి మీరు పవిత్రంగా అయిపోతారు. తండ్రి స్వీట్ హోమ్ కు లేక స్వీట్ హెవెన్ కు తీసుకువెళ్ళేందుకే వస్తారు అని పిల్లలైన మీరు అర్థం చేయించాలి. ఎవరైతే మంచి రీతిలో చదువుతారో, ధారణ చేస్తారో, వారే స్వర్గ రాజధానిలోకి వస్తారు. కానీ భాగ్యము కూడా ఉండాలి కదా. శ్రీమతముపై నడవకపోతే శ్రేష్ఠంగా అవ్వరు. ఇది శ్రీ శివ భగవానువాచ. ఎప్పటివరకైతే మనుష్యులకు తండ్రి పరిచయం లభించదో, అప్పటివరకు భక్తి చేస్తూ ఉంటారు. ఎప్పుడైతే నిశ్చయం పక్కా అవుతుందో, అప్పుడు భక్తిని తమంతట తామే వదిలేస్తారు. మీరు పవిత్రమైనవారు. గాడ్ ఫాదర్ డైరెక్షన్ల అనుసారంగా అందరినీ పవిత్రంగా తయారుచేస్తారు. వారు కేవలం హిందువులను లేక ముస్లిమ్ లను క్రిస్టియన్లుగా చేస్తారు. మీరైతే అసురీ మనుష్యులను పవిత్రంగా తయారుచేస్తారు. ఎప్పుడైతే పవిత్రంగా అవుతారో, అప్పుడు స్వర్గంలోకి లేక స్వీట్ హోమ్ కి వెళ్ళగలుగుతారు. నన్ బట్ వన్ (ఒక్కరు తప్ప ఇంకెవ్వరూ లేరు). మీరు ఒక్క తండ్రిని తప్ప ఇంకెవ్వరినీ స్మృతి చేయరు. ఒక్క తండ్రి నుండే వారసత్వము లభించనున్నది కావున తప్పకుండా ఆ ఒక్క తండ్రినే స్మృతి చేస్తారు. మీరు పవిత్రంగా అయి ఇతరులను పవిత్రంగా తయారుచేసే సహాయాన్ని చేస్తారు. ఆ నన్స్ ఏమీ పవిత్రంగా తయారుచేయరు, అలాగే తమ సమానంగా నన్స్ గా కూడా తయారుచేయరు. కేవలం హిందువుల నుండి క్రిస్టియన్లుగా తయారుచేస్తారు. పవిత్ర నన్స్ అయిన మీరు పవిత్రంగా కూడా తయారుచేస్తారు మరియు ఆత్మలందరి బుద్ధియోగాన్ని ఒక్క గాడ్ ఫాదర్ తో జోడింపజేస్తారు. గీతలో కూడా ఉంది కదా - దేహ సహితంగా దేహపు సర్వ సంబంధాలను విడిచి స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయండి. జ్ఞానాన్ని ధారణ చేయడం ద్వారానే రాజ్యం లభిస్తుంది. తండ్రి స్మృతితోనే సదా ఆరోగ్యవంతులుగా అవుతారు మరియు జ్ఞానం ద్వారా సదా సుసంపన్నులుగా అవుతారు. తండ్రి జ్ఞానసాగరుడు. అన్ని వేద-శాస్త్రాల సారాన్ని తెలియజేస్తారు. బ్రహ్మ చేతిలో శాస్త్రాలను చూపిస్తారు కదా. కావున వీరే బ్రహ్మ. శివబాబా వీరి ద్వారా అన్ని వేద-శాస్త్రాల సారాన్ని అర్థం చేయిస్తారు. వారు జ్ఞానసాగరుడు. వారి ద్వారా మీకు జ్ఞానం లభిస్తూ ఉంటుంది. మీ ద్వారా మళ్ళీ ఇతరులకు లభిస్తూ ఉంటుంది.

కొంతమంది పిల్లలు అంటారు - బాబా, మేము ఈ ఆత్మిక హాస్పిటల్ ను తెరుస్తాము, ఇక్కడకు రోగగ్రస్తులైన మనుష్యులు వచ్చి నిరోగులుగా అవుతారు మరియు స్వర్గ వారసత్వాన్ని తీసుకుంటారు, తమ జీవితాన్ని సఫలం చేసుకుంటారు, ఎంతో సుఖాన్ని పొందుతారు. అప్పుడు ఇంతమంది ఆశీర్వాదాలు వారికి తప్పకుండా లభిస్తాయి. బాబా ఆ రోజు కూడా అర్థం చేయించారు - గీతా, భాగవతము, వేదాలు, ఉపనిషత్తులు మొదలైన భారత్ యొక్క శాస్త్రాలేవైతే ఉన్నాయో, ఆ శాస్త్రాలను అధ్యయనం చేయడము, యజ్ఞాలు, తపాలు, వ్రతాలు, నోములు, తీర్థ యాత్రలు మొదలైనవి చేయడము, ఇవన్నీ భక్తి మార్గపు సామాగ్రి రూపీ మజ్జిగ. ఒక్క శ్రీమత్ భగవద్గీత యొక్క భగవంతుని ద్వారానే భారత్ కు వెన్న లభిస్తుంది. శ్రీమత్ భగవద్గీతను కూడా ఖండితం చేసారు, జ్ఞానసాగరుడు, పతిత-పావనుడు అయిన నిరాకార పరమపిత పరమాత్మకు బదులుగా శ్రీకృష్ణుని పేరును వేసి దానిని మజ్జిగగా చేసారు. ఇది ఎంత పెద్ద ఏకైక పొరపాటు. ఇప్పుడు పిల్లలైన మీకు జ్ఞానసాగరుడు డైరెక్ట్ గా జ్ఞానాన్ని ఇస్తున్నారు. ఈ సృష్టిచక్రము ఎలా తిరుగుతుంది, ఈ సృష్టి రూపీ వృక్షము యొక్క వృద్ధి ఎలా జరుగుతుంది అనేది ఇప్పుడు మీకు తెలుసు. బ్రాహ్మణులైన మీరు పిలక వంటివారు, శివబాబా బ్రాహ్మణుల తండ్రి. తర్వాత బ్రాహ్మణుల నుండి దేవతలుగా, ఆ తర్వాత క్షత్రియులుగా, వైశ్యులుగా, శూద్రులుగా అవుతారు. ఇది పిల్లిమొగ్గలాట. దీనిని 84 జన్మల చక్రము అని అంటారు. వేద సమ్మేళనాలు చేసేవారికి కూడా మీరు అర్థం చేయించవచ్చు. భక్తి మజ్జిగ, జ్ఞానము వెన్న. జ్ఞానము ద్వారా ముక్తి-జీవన్ముక్తులు లభిస్తాయి. ఇప్పుడు ఒకవేళ మీరు విస్తారంగా జ్ఞానాన్ని అర్థం చేసుకోవాలనుకుంటే - ఓపికగా వినండి. బ్రహ్మకుమారీలు మీకు అర్థం చేయించగలరు. శాస్త్రాలలో కూడా - భీష్మ పితామహుడు, అశ్వత్థాముడు మొదలైనవారికి చివరిలో ఈ పిల్లలు జ్ఞానాన్ని ఇచ్చినట్లుగా రాయబడి ఉంది. వీరైతే యథార్థమే చెప్తున్నారు అని అంతిమంలో అందరూ అర్థం చేసుకుంటారు, అంతిమంలో తప్పకుండా వస్తారు. మీరు ప్రదర్శనీ పెడతారు, ఎన్ని వేల మంది మనుష్యులు వస్తారు కానీ అందరూ ఏమైనా నిశ్చయబుద్ధి కలవారిగా అవుతారా. కోట్లలో ఏ ఒక్కరో

వెలువడుతారు, వారు మంచి రీతిలో అర్థం చేసుకొని నిశ్చయం ఏర్పరచుకుంటారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే లక్కీ జ్ఞాన సితారలకు, మాత-పిత బాప్ దాదాల నంబరువారు పురుషార్థం అనుసారంగా ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. పవిత్రముగా తయారై తమ సమానంగా పవిత్రముగా తయారుచేయాలి. ఒక్క తండ్రిని తప్ప ఇంకెవ్వరినీ స్మృతి చేయకూడదు.

2. అనేకాత్మల ఆశీర్వాదాలను పొందేందుకు ఆత్మిక హాస్పిటల్ ను తెరవాలి. అందరికీ గతి-సద్గతుల మార్గాన్ని తెలియజేయాలి.

వరదానము:- బ్రహ్మాబాబాను ఫాలో చేసి ఫస్ట్ గ్రేడ్ లోకి వచ్చే సమాన భవ

పిల్లలందరికీ బ్రహ్మాబాబా పట్ల చాలా ప్రేమ ఉంది, ప్రేమకు గుర్తు సమానంగా అవ్వడము. ఇందులో సదా ఇదే లక్ష్యాన్ని పెట్టుకోండి - 'ముందు నేను'. ఈర్ష్యకు వశమై 'ముందు నేను' అని అనడం కాదు, అది నష్టపరుస్తుంది. ఫాలో ఫాదర్ చేయడంలో 'ముందు నేను' అని అన్నట్లయితే మరియు అలా చేసినట్లయితే, అప్పుడు ఫస్ట్ వచ్చినవారితోపాటు మీరు కూడా ఫస్ట్ అవుతారు. ఏ విధంగా బ్రహ్మాబాబా నంబరువన్ అయ్యారో, అదే విధంగా ఫాలో చేసేవారు కూడా నంబరువన్ యొక్క లక్ష్యాన్ని పెట్టుకోండి. ఎవరైతే ముందు ఉంటారో వారే అర్జునులు, అందరికీ ఫస్ట్ లోకి వచ్చే అవకాశము ఉంది. ఫస్ట్ గ్రేడ్ అనంతమైనది, తక్కువేమీ కాదు.

స్లోగన్:- సఫలతా మూర్తులుగా అవ్వాలంటే స్వ సేవను మరియు ఇతరుల సేవను కలిసి-కలిసి చేయండి.

మాతేశ్వరిగారి మహావాక్యాలు

"ఈ ఈశ్వరీయ సత్సంగము సామాన్యమైన సత్సంగము కాదు"

మన ఈ ఈశ్వరీయ సత్సంగము ఏదైతే ఉందో, ఇది సామాన్యమైన సత్సంగము కాదు. ఇది ఈశ్వరీయ స్కూల్, కాలేజ్. ఈ కాలేజీలో మనం రెగ్యులర్ గా చదువుకోవాలి. అలా కాకుండా కేవలం సత్సంగానికి వెళ్ళడము, కొద్ది సమయము అక్కడ వినటము అంటే, ఎలా ఉన్నవారు అలాగే అయిపోతారు ఎందుకంటే అక్కడ ఏదైనా ప్రారబ్ధము తయారయ్యే విధంగా రెగ్యులర్ చదువు అనేది లభించదు. అందుకే మన సత్సంగము సామాన్యమైన సత్సంగమేమీ కాదు. మనదైతే ఈశ్వరీయ కాలేజ్, ఇక్కడ పరమాత్మ కూర్చుని మనల్ని చదివిస్తారు మరియు మనం ఆ చదువును పూర్తిగా ధారణ చేసి ఉన్నత పదవిని పొందుతాము. ఏ విధంగా ప్రతి రోజూ స్కూల్ లో మాస్టర్ చదివించి డిగ్రీని ఇస్తారో, అదే విధంగా ఇక్కడ కూడా స్వయంగా పరమాత్మ - గురువు, తండ్రి, టీచర్ రూపంలో మనల్ని చదివించి సర్వోత్తమమైన దేవీ-దేవతా పదవిని ప్రాప్తి చేయిస్తారు. అందుకే ఈ స్కూల్ లో జాయిన్ అవ్వటము తప్పనిసరి. ఇక్కడికి వచ్చేవారు - ఇక్కడ ఎటువంటి శిక్షణ లభిస్తుంది, ఈ శిక్షణను తీసుకోవటము ద్వారా మాకు ఏ ప్రాప్తి కలుగుతుంది అన్న జ్ఞానాన్ని తప్పకుండా అర్థం చేసుకోవాలి. మనమైతే తెలుసుకున్నాము - స్వయంగా పరమాత్మ వచ్చి మనకు డిగ్రీ పాస్ చేయిస్తారు అని, మరియు ఒకే జన్మలో మొత్తం కోర్సును పూర్తి చేయాలి. కావున ఎవరైతే మొదటి నుండి చివరి వరకు ఈ జ్ఞానము యొక్క కోర్సును పూర్తిగా తీసుకుంటారో, వారు ఫుల్ పాస్ అవుతారు. ఇకపోతే ఎవరైతే కోర్సు మధ్యలో వస్తారో, వారు అంత జ్ఞానాన్ని తీసుకోరు, అంతకుముందు వరకు ఏం కోర్సు నడిచింది అన్నది వారికేమి తెలుసు? అందుకే ఇక్కడ రెగ్యులర్ గా చదవాలి, ఈ జ్ఞానాన్ని తెలుసుకోవటం ద్వారానే ముందుకు వెళ్తారు, అందుకే రెగ్యులర్ గా చదవాలి.

"పరమాత్మకు సత్యమైన సంతానంగా అయ్యాక ఎటువంటి సంశయములోకి రాకూడదు"

పరమాత్మ స్వయంగా ఈ సృష్టిపైకి అవతరించారు కావున ఆ పరమాత్మ చేతిలో మన చేతిని పక్కాగా పెట్టాలి, కానీ

పక్కా, సత్యమైన పిల్లలే బాబా చేతిలో తమ చేతిని పెట్టగలరు. ఈ తండ్రి చేతిని ఎప్పుడూ విడిచిపెట్టకండి, ఒకవేళ విడిచిపెట్టినట్లయితే అనాథలుగా అయ్యి ఎక్కడకు వెళ్తారు! పరమాత్మ చేతిని పట్టుకున్న తర్వాత ఇక మళ్ళీ సూక్ష్మంగా కూడా - నేను చేతిని వదలాలి అన్న సంకల్పం రాకూడదు లేక మేము దాటగలమో లేదో తెలియదు అన్న సంశయము కలగకూడదు. కొందరు పిల్లలు ఎలా ఉంటారంటే, తండ్రిని గుర్తించని కారణంగా తండ్రిని కూడా ఎదిరిస్తారు మరియు మాకు ఎవరన్నా లెక్క లేదు అని కూడా అనేస్తారు. ఒకవేళ ఇలాంటి ఆలోచన వస్తే, మరి అటువంటి అయోగ్యులైన పిల్లల సంభాళన తండ్రి ఎలా చేస్తారు. అప్పుడిక వారు పడిపోయినట్లే ఎందుకంటే మాయ అయితే పడేసేందుకు ఎంతో ప్రయత్నిస్తుంది, ఎందుకంటే - వీరు ఎంత వరకు యోధులుగా, శక్తిశాలిగా, పహల్వానులుగా ఉన్నారని పరీక్ష అయితే తప్పకుండా తీసుకుంటుంది. ఇప్పుడు ఇది కూడా తప్పకుండా జరుగుతుంది, ఎంతెంతగా మనం ప్రభువుతోపాటు శక్తిశాలిగా అవుతూ ఉంటామో, అంతగా మాయ కూడా శక్తిశాలిగా అయ్యి మనల్ని పడేసేందుకు ప్రయత్నిస్తుంది. సరైన జోడీలా ఉంటుంది. ప్రభువు ఎంత శక్తిశాలినో, మాయ కూడా అంతే శక్తిని చూపిస్తుంది, కానీ - చివరి వరకు కూడా పరమాత్మ మహా శక్తివంతుడు, చివరికి వారి విజయమే ఉంటుంది అని మనకు దృఢమైన నిశ్చయము ఉంది. శ్వాస శ్వాసలోనూ ఈ విశ్వాసంలో స్థితులవ్వాలి. మాయ తన బలాన్నే చూపిస్తుంది, అది ప్రభువు ముందు తన బలహీనతను చూపించదు, ఒక్కసారి బలహీనమైనా సరే - ఇక సమాప్తము, అందుకే మాయ తన ఫోర్సును చూపించినా కానీ మీరైతే మాయాపతి చేతిని విడిచిపెట్టకూడదు. ఆ చేతిని పూర్తిగా పట్టుకున్నట్లయితే ఇక వారి విజయము జరుగుతుంది. పరమాత్మ మన యజమాని అన్నప్పుడు, వారి చేతిని వదలాలి అన్న సంకల్పం రాకూడదు. పరమాత్మ అంటారు - పిల్లలూ, నేను స్వయం సమర్థుడను, కావున నాతో పాటు ఉంటూ మీరు కూడా తప్పకుండా సమర్థులుగా అవుతారు. అర్థమైందా పిల్లలూ.